క్లుప్తంగా

నూతన జీఎస్టీతో నగదు ఆదా



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: కేంద్ర ప్రభుత్వం సవరించిన నూతన జీఎస్టీ విధానంతో కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. సోమవారం మండల పరిషత్ హాలులో పలు శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన జీఎస్టీ అమలులోకి రావడం ద్వారా నగదు ఆదా అవుతుందన్నారు. పలు రకాల ఉత్పత్తుల ధరలు తగ్గడం ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ విధానం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవోఆర్డీ సోమరాజు, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, ఏపీఎం శివ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేధిస్తున్న యూరియా కొరత



ఉప్పరాపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎస్.రాయవరం: మండలంలో యూరియా కొరత సమస్య తీరడం లేదు. చాలా రోజుల తరువాత ఉప్పరాపల్లి గ్రామంలో సోమవారం యూరియా పంపిణీ మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న రైతులు రైతు సేవా కేంద్రం వద్ద పెద్ద ఎత్తున గుమిగూడి యూరియాను తీసుకెళ్లారు. పూర్తి స్థాయిలో యూరియా రాకపోవడంతో యూరియా దొరకదన్న ఆందోళనతో రైతులు బారులు తీరారు. వచ్చిన 250 బస్తాలు యూరియా ముందు వరుసలో ఉన్నవారికి పంపిణీ చేయడంతో సుమారు 150 మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

ఏఎస్ఆర్ కాలనీలో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

యలమంచిలి రూరల్: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో పలు సమస్యలపై సోమవారం కాలనీవాసులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. సామాజిక కార్యకర్త జోగా వెంకట రమణ, చుక్కల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కాలనీవాసులు కలెక్టర్‌ను కలిసి తమ కాలనీ(18వ వార్డు)లో పెద్ద వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉందని, సుమారు 3 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఈ బావి రోడ్డుకు సమాంతరంగా ఉందని, దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఈ బావి గట్టు ఎత్తు పెంచి, రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో సుమారు 100 ఇళ్లకు మంచినీటి సరఫరా జరగడం లేదని, సీసీ రోడ్లకు పక్కన మురుగు కాల్వలు లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు కాలనీవాసులు తెలిపారు.

దొప్పెర్లలో చెరువులో మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

అచ్యుతాపురం రూరల్ : దొప్పెర్ల గ్రామంలో అక్రమంగా చెరువు మట్టి తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దొప్పెర్ల గ్రామ రెవెన్యూ పంచాయతీ సర్వే నంబర్ 40లోని గంగునాయుడు చెరువులో అనధికారికంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకూ తవ్విన మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పరిశ్రమలకు అమ్ముకుంటున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరారు.

దుర్గమ్మ పట్టీలు రూ.80 వేలకు వేలం

ఎస్.రాయవరం: తిమ్మాపురం గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మకు దమ్ము రాజు అనే భక్తుడు 12 తులాలు వెండి పట్టీలు బహూకరించారు. వీటికి ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో యాదాల లక్ష్మీ, శ్రీను దంపతులు అత్యధికంగా రూ.80 వేలకు దక్కించుకున్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

అచ్యుతాపురం రూరల్ : ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు, తదితరులు పాల్గొన్నారు.

సొంత గూడు కరువు

- సామాజిక, ప్రైవేటు భవనాల్లో కొత్త పంచాయతీల నిర్వహణ
- చాలీచాలని వసతులతో అష్టకష్టాలు
- భవన నిర్మాణాలకు నిధుల కేటాయింపు ప్రచారానికి పరిమితం
- పదవీ కాలం ముగిసే లోగానైనా భవనాల నిర్మాణాలు జరిగేనా?



ప్రైవేటు భవనంలో మల్లవరం పంచాయతీ కార్యాలయం

మునగపాక: పాలనా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కొత్త పంచాయతీలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజలకు సకాలంలో సేవలందించేందుకు వీలుగా జనాభా ప్రాతిపదికన కొత్త పంచాయతీలు ఎంపిక చేశారు. అయితే కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు చేసే క్రమంలో ప్రభుత్వం మారడం శాపంగా మారింది. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొత్త పంచాయతీలు సామాజిక, ప్రైవేటు భవనాల్లో తమ కార్యకలాపాలు నిర్వహించాల్సి వస్తోంది. చాలీచాలని వసతుల నడుమ అష్టకష్టాలు పడుతూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీల పాలక వర్గాల సమయం గడువు దగ్గర పడుతున్నా ఇంతవరకు కొత్త భవనాల నిర్మాణాల పట్ల ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

సామాజిక, ప్రైవేటు భవనాలే దిక్కు

కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు పక్కా భవనాలు లేక పరిపాలనా పరమైన ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో కొన్ని చోట్ల సామాజిక భవనాలు, మరికొన్ని చోట్ల ప్రైవేటు భవనాల్లో పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో అటు పంచాయతీ పాలకవర్గం, ఇటు పలు పనులపై వచ్చే అర్జీదారులు పడరాని పాట్లు పడుతున్నారు. పంచాయతీ సమావేశాలు నిర్వహించేందుకు కూడా అవస్థలు తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే వారు ఆరుబయట నిరీక్షించాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

పాత పంచాయతీలు 21.. కొత్త పంచాయతీలు 6

మండలంలోని మొత్తం 21 పంచాయతీలు పాతవి ఉండేవి. పరిపాలనా పరమైన ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ హయాంలో 6 పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేశారు. మల్లవరం, గొల్లలపాలెం, మూలపేట, రామగిరి, కాకరాపల్లి, నారాయుడుపాలెం పంచాయతీలు కొత్తగా ఏర్పాటయ్యాయి. పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయ్యే పరిస్థితులు దాపురిస్తున్నా ఇంత వరకు పక్కా భవనాలు లేక సర్పంచ్‌లు, పాలకవర్గాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం

నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాలకు అధికారులు ప్రతిపాదనలు చేయడం తప్ప అమలులోకి తీసుకురాలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవనాలకు అవసరమైన స్థలాలను హడావుడిగా పరిశీలించారు. ఒక్కొక్క పంచాయతీ భవనానికి రూ.32 లక్షల మేర జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించేలా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇంత వరకు నయాపైసా నిధులు మంజూరు కాలేదు. దీంతో కొత్త భవన నిర్మాణాలు అందని ద్రాక్షగా తయారైందంటూ పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి రాగానే..

కొత్త పంచాయతీ భవన నిర్మాణాలకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఒక్కొక్క పంచాయతీకి రూ.32 లక్షల మేర ఉపాధి హామీ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు అందజేశాం. అంతేకాకుండా భవన నిర్మాణాలకు స్థలాలు కూడా పరిశీలించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే భవన నిర్మాణాలపై దృష్టి సారిస్తాం.

– గులామ్, మండల ఇంజినీరింగ్ అధికారి

జెడ్పీటీసీ సభ్యుడు లంకాకు పరామర్శ



జెడ్పీటీసీ సభ్యుడు లంకా సూర్యనారాయణను పరామర్శిస్తున్న కంబాల, చిక్కాల, నాయకులు

పాయకరావుపేట: జెడ్పీటీసీ సభ్యుడు లంకా సూర్యనారాయణను సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామరావు పరామర్శించారు. ఇటీవల కంటికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న సూర్యనారాయణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు ఎ.ఎస్.ఎన్.మధువర్మ, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, ఉప సర్పంచ్ జగతా శ్రీనివాస్, సర్పంచ్‌లు పన్నీరు పాపారావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, చేపల నాగమణి తాతాజీ, పార్టీ మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోడపాటి గోవిందు, ఎంపీటీసీ పులగల రాంబాబు పాల్గొన్నారు.

మునగపాక పీఏసీఎస్ మహాజన సభ నేడు

మునగపాక: మునగపాక పీఏసీఎస్ మహాజన సభ మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనుందని సంఘ సీఈవో పెంటకోట మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సంఘ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

వాగ్దేవికి ప్రణమిల్లి..



దోసూరులో దుర్గమ్మకు సరస్వతీదేవి అలంకరణ



యలమంచిలిలో సరస్వతీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

మునగపాక: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పలు గ్రామాల్లో అంబలం పూజలతో పాటు అన్నసమారాధనలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు భక్తులకు సరస్వతీ దేవీ అవతారంలో దర్శనమిచ్చారు. మునగపాక లింగరాయి గుడి ఆవరణలో వేద పండితులు సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని సరస్వతీ దేవీ విగ్రహానికి ఎస్ఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు పూలమాల వేసి పూజలు చేశారు. పూర్వ విద్యార్థులు ఆడారి శ్రీకాంత్, పెంటకోట అప్పలనాయుడు, టెక్కలి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. ఉమ్మలాడలో ఆదివారం రాత్రి దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంది.

దుర్గమ్మకు బోనాలు

ఎస్.రాయవరం: దార్లపూడి గ్రామంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. భవాని మాలధారణ భక్తులు, సాధారణ భక్తులు కలిసి సంప్రదాయబద్ధంగా అమ్మవారి బోనాలు ఊరేగించారు. వీధుల్లో అమ్మవారి బోనాలతో దర్శనమివ్వడంతో భక్తులు అమ్మవారి శరణఘోష వినిపించారు. ఈ కార్యక్రమం గురుభవాని పొట్టి శ్రీనివాస్, శివాజీ, కోరెడ్డి బాబి, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : మండలంలో పలు చోట్ల కనకదుర్గ అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. దోసూరులో సరస్వతీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి పండితుడు శర్మ మాస్టార్ ఆధ్వర్యంలో విద్యార్థులు పూజలు చేశారు. జంగులూరులో అమ్మవారికి పేటతుల్లి ఆడుతూ సారె ఊరేగింపు చేసి నైవేద్యం సమర్పించారు. ఆయా గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

యలమంచిలి రూరల్: పట్టణంలోని సమితి ఆఫీసు రోడ్డులోని ఆధ్యాత్మిక గాయత్రీ ఆధ్యాత్మిక పీఠం, దిమిలి రోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లను సరస్వతీదేవి అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో విద్యార్థులు, దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పీఎస్ఆర్ పేట దుర్గాదేవి ఆలయంలో నిర్వహించిన సరస్వతీదేవి పూజల్లో భవానీ భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. దాతలు విద్యార్థులకు పరీక్ష అట్టలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.



ఉమ్మలాడలో ఆకట్టుకున్న దుర్గాదేవి దీపాలంకరణ



మునగపాక హైస్కూల్‌లో సరస్వతీ దేవీ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



దార్లపూడిలో అమ్మవారి బోనాలు ఊరేగిస్తున్న భక్తులు



జంగులూరులో పేటతుల్లి ఆడుతూ అమ్మవారి సారెను ఊరేగిస్తున్న భవానీ భక్తులు



పీఎస్ఆర్ పేటలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్ష అట్టలు అందజేస్తున్న దాతలు



యలమంచిలి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీదేవి పూజ

భూములు ఆన్‌లైన్ చేయాలని దళితుల ఆందోళన

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరులో తమకు పట్టాలిచ్చిన భూములకు ఆన్‌లైన్ చేసి అప్పగించాలని కోరుతూ దళితులు సోమవారం గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇచ్చిన భూములకు అధికారులు ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ గోడు వినిపించుకుంటే మండల, గ్రామ స్థాయి అధికారులకు ఆదేశాలు వచ్చాయన్నారు. అయితే గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ భూసమస్యలు పరిష్కరించకుంటే కార్యాలయంలో విధులు చేయనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎం.సత్యనారాయణ, బాధితులు పిల్లి లక్ష్మి, ఏనుగుపల్లి భాస్కర్, పోలవరపు అప్పారావు, షేక్ హుస్సేన్, ఎస్.కె.బేబి తదితరులు పాల్గొన్నారు.



పెదగుమ్ములూరు సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

‘డిజిటల్ బుక్’తో కూటమి అరాచక పాలనకు చెక్



మునగపాకలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్, తదితరులు



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు



అచ్యుతాపురంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మునగపాక: అన్యాయానికి గురైన ప్రజలు, పార్టీ కార్యకర్తలకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ భరోసా ఇచ్చారు. కూటమి అరాచక పాలనకు చెక్ పెట్టేందుకు డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజులు వైఎస్సార్‌సీపీవేనన్నారు. వైఎస్ జగన్ నాయకత్వంలో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, కేసులను డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేయాలన్నారు. కూటమికి చెందిన నేతల ఆగడాలు, ఇసుక మాఫియా, మట్టి మాఫియా వంటి సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అధికారులు కక్ష సాధింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ నేతలు కాండ్రేగుల నూకరాజు, దేశంశెట్టి శంకరరావు, కోన బుజ్జి, నర్మాల కుమార్, గంగూలి, పిల్లి అప్పారావు, పిన్నమరాజు రవీంద్రరాజు, సుందరపు తాతాజీ, మద్దాల వీరునాయుడు, మొల్లేటి శంకర్, పిట్టా మంగారెడ్డి, శీరా రమణమ్మ, ఆడారి త్రిమూర్తులు, భీముని వెంకటేశ్వరరావు, భీముని నాగేశ్వరరావు, జువ్వాలనాయుడు, నాగేశ్వరరావు, కట్టుమూరి శ్రీను, రావి శోభన్‌బాబు, గంగిరెడ్డి రాము, పీలా నరసింగరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, ఈత బాబూరావు, వాసుపల్లి శ్రీనివాసరావు, లాలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు పట్టణంలోని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గపల్లి సాయిబాబా కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాల్మన్‌పేట, కేశవరం, గోపాలపట్నం, మాసాహెబుపేట సర్పంచ్‌లు కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, పన్నీరు బాబ్జి, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పంచాయతీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.కె.ఆర్.ఎస్.లత, నాయకులు గుజ్జు గోవిందరెడ్డి, పల్లేల కృష్ణ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి యజ్జల అన్నవరం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, ఎంపీపీ కోన సంధ్యబుజ్జి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించేందుకు ఎక్కడికక్కడ డైవర్షన్ పాలిట్రిక్స్ చేస్తుందని విమర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో ఇబ్బంది పెడుతున్న వారిని డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేస్తే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చర్యలు తప్పవని జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ హెచ్చరించారు. ఎంపీపీపై అవిశ్వాసం అంటూ వస్తున్న అసత్య ఆరోపణలను ఎవరూ పట్టించుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చేపల శ్రీరాములు, భీముని వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కూండ్రపు సత్యారావు, గొర్లి అశ్విని నూకరాజు, లాలం వాణివాసు, రాజాన నాయుడుబాబు, ఎంపీటీసీలు శనివాడ జువ్వలనాయుడు, లాలం శ్రీను, నగిరెడ్డి నాగేశ్వరరావు, ఈతా బాబూరావు, పుర్రె లక్ష్మీసన్యాసిరావు, రావి లక్ష్మీశోభనబాబు, మండల యూత్ అధ్యక్షులు కారుకుండి శ్రీను, బలిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, మాడెం సూరిఅప్పారావు, పంచదార్ల రవి, పోలవరపు ఉస్తాదు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దౌర్జన్యాలకు కచ్చితమైన రిటర్న్ గిఫ్ట్

కోటవురట్ల: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే రిటర్న్ గిఫ్ట్ మరింత గొప్పగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. కోటవురట్లలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, వేధింపులతో కక్షపూరిత రాజకీయాలు పెరిగిపోయాయన్నారు. అన్యాయంగా వేధించిన ప్రతి పనికి ప్రతిఫలం కచ్చితంగా ఇచ్చేందుకే జగన్ ఈ డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఇబ్బంది పడిన ప్రతి ఒక్కరూ డిజిటల్ బుక్‌లో తమకు జరిగిన అన్యాయాన్ని స్పష్టంగా వివరిస్తూ అందుకు కారణమైన వారి పేర్లను నమోదు చేయాలన్నారు. రెడ్ బుక్ పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న విధ్వంసం, దౌర్జన్యాలను తిప్పికొట్టాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు మాట్లాడుతూ డిజిటల్ బుక్‌ను అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు బి.అనిల్‌కుమార్, రమణ, జిల్లా కార్యదర్శి, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ యూత్ నాయకుడు శెట్టి బాబ్జీ, పార్టీ నాయకులు కొరుప్రోలు రమణ, రుత్తల గోవిందు, అవుగడ్డి దుర్గా రాజీవ్ పాల్గొన్నారు.



కోటవురట్లలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డి.వి.ఎస్.ఎన్.రాజు, పార్టీ నాయకులు

మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన అవసరం



గర్భిణులకు సీమంతం చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం రూరల్ : మహిళలకు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ హోమియో వైద్యాధికారి సౌభాగ్య లక్ష్మి అన్నారు. సోమవారం భోగాపురం సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. భోగాపురం సర్పంచ్ లాలం లక్ష్మి పైడికొండ, జంగులూరు సర్పంచ్ కూండ్రపు సత్యారావు, చిప్పాడ సర్పంచ్ రాజాన నాయుడుబాబు, అంగన్‌వాడీ నారాయణమ్మ, సీహెచ్‌వో దైవకృపాచార్యులు, పీహెచ్ఎస్ వరలక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి



వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం సమన్వయకర్త గణేష్‌ను సత్కరిస్తున్న ప్రసాద్, పార్టీ నేతలు



బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత, తదితరులు

మునగపాక: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన ప్రసాద్‌కు సోమవారం పలు ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అభినందనలు తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకర్ గణేష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావుతో పాటు పలు మండలాలకు చెందిన పార్టీ నేతలు.. తరలివచ్చి ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు ఆడారి అచ్చియ్యనాయుడు, దేశంశెట్టి శంకరరావు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు నర్మాల కుమార్, అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, పార్టీ నేతలు భీముని వెంకటేశ్వరరావు, దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, మద్దాల వీరునాయుడు, తాతాజీ, మొల్లేటి శంకర్, మొల్లేటి వినోద్, కారుకుండి గంగూలి, పిన్నమరాజు రవీంద్రరాజు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సోమస్కంధమూర్తి ఆలయ వార్షికోత్సవం

యలమంచిలి రూరల్: పట్టణంలో వెలసిన సోమస్కంధమూర్తి ఆలయ 36వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి నిర్వహించిన పంచామృతాభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఉత్సవ విగ్రహాలను ధర్మవరం వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు, అనువంశిక ధర్మకర్తలు గొల్లవిల్లి కాసులనాయుడు, నాగమణి, కొఠారు రామ్మోహనరావు పాల్గొన్నారు.



సోమస్కంధమూర్తి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న ధర్మకర్తలు